

చెన్నయ్.. చంద్రముా!

హాయ్.. హాలో.. నమస్తే.. బాగున్నారా! అంటూ సినీనటి శ్రీలీల రాజమహేంద్రవరంలో సందడి చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రారంభించి కాసేపు అభిమానులతో ముచ్చటించారు. శ్రీలీల వస్తుందని తెలియడంతో పెద్ద ఎత్తున అభిమానులు ఆ షోరూమ్ వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీలీల అభిమానుల ముందుకు వచ్చి కాసేపు సందడి చేశారు. రాజమహేంద్రవరం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు.. చెన్నయ్ చీరలంటే నాకు చాలా ఇష్టమని.. ఈసారి చీరలు కావాలంటే రాజమహేంద్రవరం వచ్చేస్తానని చెప్పడంతో అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు.. ఈలలు.. కేకలతో సందడి చేశారు.. దీంతో శ్రీలీల ఐ లవ్ రాజమహేంద్రవరం అంటూ లవ్ సింబల్‌తో ఇలా పోజిచ్చారు. -6లో

అన్నింటా ప్రగతి!

- అన్ని రంగాల్లో జిల్లా అద్భుత అభివృద్ధికి స్వర్ణాంధ్ర 2047 విజన్
- 2024 నుంచి 2029 వరకు శాఖలవారీగా అభివృద్ధి ప్రణాళిక తయారీ
- నేడు కలెక్టర్ల సదస్సులో వివరించనున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- 2029 నాటికి జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.4,47,831
- వ్యవసాయోత్పత్తుల విలువ రూ.1,903 కోట్ల నుంచి రూ.2,996 కోట్లకు..
- ఉద్యాన ఆదాయం రూ.4,899కోట్లు, ఆక్వా రూ.9,613కోట్లు
- వచ్చే ఐదేళ్లలో జిల్లా అభివృద్ధిలో పారిశ్రామికరంగానిదే ప్రధాన వాటా
- జిల్లాలో పాల ఉత్పత్తి 2028-2029నాటికి 84.76లక్షల మెట్రిక్ టన్నులు
- మెరైన్ ఫిష్ ఇప్పుడున్న 1.02 లక్షల టన్నుల నుంచి 2 లక్షల టన్నులకు

(ఆంధ్రజ్యోతి-కాకినాడ)

కాకినాడ జిల్లా భవిష్యత్తులో అన్ని రంగాల్లో అద్భుతంగా సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్వర్ణాంధ్ర2047 లక్ష్యంగా వచ్చే ఐదేళ్లలో జిల్లాలో వ్యవసాయ, పాడిపంటలు, వాణిజ్య, ఉపాధి, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో ఏ స్థాయిలో వృద్ధి సాధించాలనే దానిపై కార్యాచరణ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆయా విభాగాల్లో అభివృద్ధి ఎలా ఉంది? దీన్ని వచ్చే ఐదేళ్లకు ఎలా రెట్టింపు చేయాలనే దానిపై విజన్ డాక్యుమెంట్ సిద్ధంచేసింది. దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం తరఫున ఏమేం చేయాలనేదానిపై కలెక్టర్ల ద్వారా నివేదిక తయారు చేయించింది. దీన్ని నేడు కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ షాన్‌మోహన్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఆయా కీలకరంగాల వారీగా ప్రభుత్వం ఏమేం చేయబోతోంది.. చేయాలి? అనేదానిపై వివరించనున్నారు. ఇందుకోసం 2028-2029నాటికి ఈ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తే జిల్లా ఏవిధంగా ఉండబోతోంది? అనేది కూలంకుషంగా ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దీని ప్రకారం ప్రస్తుతం జిల్లాలో అన్ని వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, సేవా రంగాల ఉత్పత్తులు కలిపి గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీడీపీ) రూ.51,370 కోట్లుగా లెక్కించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ అయిదేళ్ల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఇది రూ.1.13 లక్షల కోట్లకు ఎగబాకే అవకాశం ఉందని విశ్లేషించారు. ప్రస్తుతం జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2,05,300కాగా 2028-2029నాటికి ఇది రూ.4,47,831కు పెరుగుతుందని వివరించారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వం ఐదేళ్ల ప్రణాళిక ద్వారా జిల్లా ప్రజల ఆదాయం రెట్టింపుకానుంది. ప్రధానంగా జిల్లాలో అన్ని రకాలవ్యవసాయ ఉత్పత్తుల విలువ ప్రస్తుతం రూ.1,903కోట్లుగా ఉంది. ఇది 2028-2029కి రూ.2,996 కోట్లకు ఎగబాకనుంది. ఉద్యాన రంగం రూ.2,290కోట్ల నుంచి రూ.4,899కోట్లు, ఆక్వా కల్చర్ రూ.4,634 కోట్ల నుంచి రూ.9,613కు పెరగనున్నట్టు అంచనా వేశారు. అలాగే జిల్లా ప్రగతిలో అత్యధికంగా లైవ్‌స్టాక్ రూపంలో సమకూరనుంది. ఇది ప్రస్తుతం రూ.6,407కోట్లు ఉండగా, ఐదేళ్ల తర్వాత రూ.12,487 కోట్లకు పరుగులు తీయనుందని అంచనా వేశారు.

పాలు అమాంతం రెట్టింపు..

భవిష్యత్తులో జిల్లాలో పారిశ్రామికరంగం అభివృద్ధి భారీస్థాయిలో ఉండనున్నట్టు నివేదికలో విశ్లేషించారు. మైనింగ్, తయారీ, ఎలక్ట్రికల్, గ్యాస్, నిర్మాణరంగంలో 18 శాతం వరకు అభివృద్ధి జరగనుంది. అలాగే ప్రస్తుతం జిల్లాలో 1.48 లక్షల హెక్టార్లలో వరి సాగు జరుగుతోంది. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే 10.57లక్షల టన్నుల వరి విలువ రూ.1,903 కోట్లు. దీన్ని రానున్న ఐదేళ్లలో ఎకో ఫ్రెండ్లీ ఎరువులు, సీడ్ ట్రీట్‌మెంట్ ద్వారా భవిష్యత్తులో 13.09 లక్షల టన్నులకు తీసుకువెళ్లవచ్చు. అలాగే ఏటా తుఫాన్ల వల్ల పంటనష్టపోతున్న నేపథ్యంలో ఏటా కాలువల ద్వారా మే 25కి ముందే నీరు ఇస్తే పంటనష్టం నుంచి గట్టెక్కవచ్చని నివేదికలో కలెక్టర్ విశ్లేషించారు. అలాగే మూడో పంట సైతం పెద్దఎత్తున వేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల ద్వారా వస్తోన్న ఉత్పత్తుల విలువ రూ.2,290 కోట్లుగా లెక్కగట్టారు. అందులో అరటి పంట ఉత్పత్తుల ద్వారా రూ.377 కోట్లు, మామిడి రూ.342 కోట్లు, జీడిపప్పు రూ.147 కోట్లు, కొబ్బరి రూ.72 కోట్లుగా తేల్చారు. అలాగే జిల్లాలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తికి సంబంధించి లైవ్‌స్టాక్ ద్వారా రూ.6,407 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఇందులో పాల ద్వారా రూ.2,916 కోట్లు, మాంసం రూ.2,279 కోట్లు వస్తోంది. గుడ్ల ద్వారా రూ.1,106 కోట్లు వస్తోంది. అయితే ఐదేళ్ల ప్రణాళిక ద్వారా జిల్లాలో పాల ఉత్పత్తి ప్రస్తుతం 5,54,918 మెట్రిక్ టన్నులు ఉండగా, ఇది 2028కి 8,47,607 మెట్రిక్ టన్నులకు పెరగనుంది. మాంసం 57 వేల మెట్రిక్ టన్నుల నుంచి 84,923 మెట్రిక్ టన్నులకు పెరగనున్నట్టు అంచనా వేశారు. మెరైన్ ఫిష్ ఉత్పత్తి ఇప్పుడున్న 1,02,471టన్నుల నుంచి 2028కి 2,00,730 టన్నులకు పెరగనుంది. అలాగే జిల్లాలో పేదలకు 5.25 లక్షల ఇళ్లు అవసరం కాగా ఇప్పటికే 3.5 లక్షల నిర్మాణం జరిగింది. ఇంకా 1.75 లక్షల ఇళ్లు వచ్చే ఐదేళ్లలో నిర్మించనున్నారు. అటు కాకినాడ సెజ్‌లో గేట్‌వే పోర్టు నిర్మాణం ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. రూ.2,123 కోట్లతో 16ఎంఎంటీపీఏ సామర్థ్యంతో 2026 జూలై 19కి పూర్తికానున్నట్టు అంచనా. దీనిద్వారా 5,500 ఉద్యోగాలతోపాటు పారిశ్రామిక, సేవల రంగం మరింత వృద్ధి చెందనుంది.



అమరావతిలో కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

రేషన్ మాఫియాను అణిచి వేయాల్సిందే..

- కలెక్టర్ల సదస్సులో కాకినాడ కేంద్రంగా వైసీపీ అరాచకాలపై చర్చ
- విదేశాలకు రేషన్ స్మగ్లింగ్, పోర్టులో వాటాల వశంపై ప్రస్తావన
- ఈ అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం, డిప్యూటీ సీఎం
- కాకినాడలో రేషన్ మాఫియాకు అడ్డుకట్టపడాలని ఆదేశించిన సీఎం
- బియ్యం స్మగ్లింగ్ తీరుతో షాక్ అయ్యానన్న పవన్‌కల్యాణ్
- మూడు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినా బియ్యం స్మగ్లింగ్ ఆగకపోవడం ఏంటని అసహనం
- కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిన బాధ్యత ఉందని సూచన

(ఆంధ్రజ్యోతి-కాకినాడ)

కలెక్టర్ల సదస్సులో కాకినాడ వ్యవహారం కాక పుట్టించింది. ఇక్కడి నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలు అక్రమంగా తరలిపోతుండడం, కాకినాడ సీపోర్టులో బలవంతంగా గత వైసీపీ పాలకులు వాటాలు రాయించేసుకున్న వైనం చర్చకు దారితీసింది. ఈ ఘటనలపై బుధవారం జరిగిన సదస్సులో చాలాసేపు సీఎం, డిప్యూటీ సీఎం చర్చించడంతో కాకినాడ కేంద్రంగా సదస్సు కొంత వేడెక్కింది. రేషన్ మాఫియా వేళ్లూనుకుపోయిన విధానంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సీరియస్‌గా ప్రస్తావించడంతో ఐఏఎస్‌ల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. కాకినాడ నుంచి విదేశాలకు నౌకలో రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడడం, అనంతరం వేలకోట్ల బియ్యం వ్యాపారం వెనుక ఉన్న మాఫియా అంతు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయడం వరకు మాఫియా ఏవిధంగా అడ్డగోలుగా బరితెగించిందనేదానిపై వీరిద్దరు కలెక్టర్ల ఎదుట తీవ్రంగా స్పందించడంతో వాతావరణం వేడెక్కింది. తొలుత సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్టపడాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ నుంచి విదేశాలకు తరలిపోయిన బియ్యం మాఫియాపై ఇప్పటికే సిట్‌ను నియమించామని, పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ పెట్టొచ్చని ఆదేశించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసేవారు స్ట్రాంగ్ మాఫియాగా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీన్ని అరికట్టడానికి కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని మాటుగా హెచ్చరించారు. గత వైసీపీ హయాంలో ఏ స్థాయిలో నేరగాళ్లు రెచ్చిపోయారనడానికి అనేక ఘటనలు కాకినాడలో జరిగాయని గుర్తుచేశారు. గతంలో అక్రమార్కులు భూములను మాత్రమే కబ్జాలు చేసేవారు. కానీ ఇప్పుడు పోర్టులు, సెజ్‌లను కూడా కబ్జా చేసేస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అక్రమాలను అడ్డుకునేందుకు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చామని వివరించారు. అలాగే జిల్లాల్లో ఏ నేరం జరిగినా వెనుక గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లు ఉన్నట్టు వెలుగులోకి వస్తున్నాయని, దీన్ని కలెక్టర్లు అడ్డుకోవాలని ఆదేశించారు.

ఆరోజు కాకినాడలో షాక్ అయ్యా...

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ కాకినాడలో ఏస్థాయిలో రేషన్ స్మగ్లింగ్ ముఠాలు పాతుకుపోయాయో వివరిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ విదేశాలకు ఎలా తరలిపోతుందో ప్రస్తావించడంతో సదస్సు చాలాసేపు వేడెక్కింది. ఇటీవల తాను కాకినాడ పోర్టులో పర్యటించినప్పుడు అక్కడ జరుగుతున్న బియ్యం స్మగ్లింగ్ చూసి షాక్ అయ్యానని చెప్పడంతో కలెక్టర్లంతా నివ్వెరపోయారు. తాను కాకినాడలో పర్యటించక ముందు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల చాలాసార్లు అక్కడ పర్యటించి రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరగకుండా అధికారులకు కొన్ని సూచనలు చేశారని, అందులోభాగంగా మూడు చెక్‌పోస్టులు పోర్టు వద్ద ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు. అంత జరిగినా తాను వెళ్లి స్వయంగా పరిశీలిస్తే పోర్టు వద్ద ఎన్నో అవకతవకలు, స్మగ్లింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా జరగడం చూసి వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో అర్థమైందని చెప్పడంతో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. కాకినాడ కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిన బాధ్యత ఉందని పేర్కొంటూ అధికారుల పనితీరుపై కొంత అసహనం వ్యక్తం చేశారు. తాను కేవలం బియ్యం స్మగ్లింగ్ కోసమే కాకినాడలో ఆరోజు మాట్లాడలేదని స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలు నిరోధించకపోతే తీవ్రవాదులు, పేలుడు పదార్థాలు కాకినాడ పోర్టు ద్వారా దేశంలోకి రావడానికి ఆస్కారం ఉందన్నారు. 2008లో కసబ్‌లాంటి తీవ్రవాదులు ముంబై పోర్టు ద్వారా చొరబడి 300 మంది ప్రాణాలు బలిగొన్నారని, కాకినాడ పోర్టు భద్రంగా లేకపోవతే అలాంటివి జరగవని గ్యారెంటీ ఏంటని ప్రశ్నించారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరిగే సాగునీటి సంఘాలకు ఎన్నికలకు సంబంధించి బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికలకు బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గల 236 సాగునీటి సంఘాలు, 1992 టెరిటోరియల్ నియోజకవర్గాలు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 110 మైనర్ ఇరిగేషన్ కమిటీల ఎన్నికల నిర్వహణకు ఈ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలు ఆయా తహశీల్దార్, మండల అభివృద్ధి అధికారి, నీటిపారుదల శాఖ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచడం జరుగుతోందన్నారు. వ్యవసాయం, రైతాంగమే రాష్ట్రానికి ప్రాణం అనే ఉద్దేశంతో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి, చివరి ఎకరం వరకు సాగునీరు అందజేయాలనే లక్ష్యంతో సాగు నీటి సంఘాలను పునరుద్ధరించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. ఇక సాగునీటి సంఘాలకు 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఇలా రెండు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

కేరళపై బీజేపీ ప్రభుత్వ పక్షపాత వైఖరి నశించాలి

కాకినాడ కలెక్టరేట్ వద్ద రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా బుధవారం ధర్నా నిర్వహించారు. కేంద్రం నుంచి కేరళ రాష్ట్రానికి రావలసిన వాటాతోపాటు వయనాడ్ వరద సహాయం అందించకుండా ఆ రాష్ట్రం పట్ల పక్షపాత వైఖరికి నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ వల్లు రాజబాబు మాట్లాడుతూ నూరు శాతం అక్షరాస్యత, మహిళా సాధికారత, విద్యా వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో కేరళ దేశంలో అగ్రస్థానంలో పయనిస్తోందని, వారిపై వివక్షపూరితంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సూర్యనారాయణ, ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమణి, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

ఐఈఆర్టీలతో సమీక్షా సమావేశం

కాకినాడ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ సమగ్ర శిక్ష కార్యాలయంలో సహిత విద్యా విభాగం ఐఈఆర్టీలతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించినట్టు సహిత విద్య ఐఈ సమన్వయకర్త సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాలుగా సహాయంగా ఉండాలని, మండలంలోని ప్రతీ దివ్యాంగులను గుర్తించి వారిని బడిలో నమోదు చేసినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే ఖచ్చితంగా నిర్వహించి అర్హతగల వారందరినీ భవిత కేంద్రంలో చేర్చుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌వో భోగిరెడ్డి, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయాలని కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కాకినాడ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, పలు స్టేషన్లో రైల్వే హాల్ట్‌లు కోరుతూ వినతిపత్రం సమర్పించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ఆర్‌యుబీ, ఆర్‌వోబీలు నిర్మించాలని కోరారు. అలాగే రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. వీటిలో ముఖ్యంగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అన్నవరంలో వందేభరత్ ఎక్స్ ప్రెస్‌కు, రత్నాచల్, జన్మభూమి ట్రైన్స్‌కు పిఠాపురంలో బొకారో, గుంటూరు-రాయగడ ట్రైన్స్‌కు గొల్లప్రోలు హాల్ట్‌లు కల్పించాలని ఉదయ్ శ్రీనివాస్ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు కొత్త హాల్ట్‌ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ఎంపీ ఉదయ్ తెలిపారు.

దివాణం కోట





దివాణం గేటు.. కోట లోపల ఊగుటుయ్యాల.. మంచం.. దివాణం హాలులో నగిషీలు చెక్కిన ఫర్నిచర్





చెక్కు చెదరని చరిత్ర

కపిలేశ్వరపురం జమిందారీ సంస్థానానికి వందల ఏళ్ల చరిత్ర
దివాణం నిర్మాణానికి 144 ఏళ్లు
ఇప్పటికీ అదే రాజసంతో దర్శనమిస్తున్న ఎస్టేట్
అలనాటి జ్ఞాపకాలుగా ఫర్నిచర్, ఇతర సామగ్రి

(ఆంధ్రజ్యోతి- మండపేట)

ఇప్పుడు రాజ్యాలు లేవు. వలస పాలకులూ లేరు. వీరికి, ప్రజలకు అనుసంధానంగా కొనసాగిన జమిందారీ వ్యవస్థా నేడు లేదు. కానీ జమిందారీ వ్యవస్థ నాటి వైభవానికి సజీవ సాక్ష్యాలు ఉన్నాయి. జమిందార్లు లేకపోయినా వారు నివసించిన దివాణాలు ఉన్నాయి. వారి వారసుల సంరక్షణలో జమిందారులు వినియోగించిన వస్తు సామగ్రి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఒక్కొక్క జమిందారీ దివాణం ఒక్కో చరిత్ర. కపిలేశ్వరపురం జమిందారీ దివాణం కూడా అందులో ఒకటి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామంలో జమిందార్ కుటుంబానికి సంబంధించిన దివాణం భవనాలు నేటికీ పదిలంగానే ఉన్నాయి. 1880లో నిర్మించిన దివాణం భవనాలు ఆనాటి నిర్మాణం పనితనం, నైపుణ్యానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఇక్కడ జమిందార్ దివాణం గోదావరి నది చెంతనే ఉంది. సాధారణంగా జమిందార్లు అంటే మొత్తంగా భూయజమాన్య హక్కులు కలిగినవారు. అభివృద్ధిలోను, రైతుల నుంచి పన్నుల వసూళ్లలోను కీలక భూమిక వహించేవారు. అలాగే సాహిత్య, సాంస్కృతిక కళలకు రాజపోషకులు. కపిలేశ్వరపురం జమిందార్లు కూడా తమ హయాంలో సాంస్కృతిక వైభవానికి పునాదులు వేశారు. వాటిలో భాగమే వేద పాఠశాల, హరికథ పాఠశాలలు ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కపిలేశ్వరపురం ఎస్టేట్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఎస్టేట్‌ను సంపాదించిన బలుసు వంశీయులు, 1635లో దుర్జయ వంశస్థులు కాకతీయ రాజ సంతతికి చెందిన శ్రీబలుసు నాగినీడు తొలి జమిందార్‌గా వ్యవహరించారని పూర్వపు చరిత్ర చెబుతోంది. ఆ తర్వాతకాలంలో బ్రిటీష్ పాలనలో అంగ్లేయుల నుంచి 1818లో బలుసు పెద సర్వారాయుడు ఈ జమీ పొందారు. కపిలేశ్వరపురం జమీలో ఆరు శివారు లంకలు ఉండేవి. 1847లో పెదసర్వారాయుడు చనిపోగా, ఆయన కొడుకు బుచ్చి కృష్ణయ్య పాలనకొచ్చారు. ఆయన 1852లో ఆరు గ్రామాలు ఉన్న కేశనకుర్రు సంస్థానాన్ని రాజా దంతులూరి బుచ్చి కృష్ణంరాజు నుంచి కొనుగోలు చేసి విస్తరించారు. ఎన్నో ప్రజా కార్యక్రమాలు చేపట్టారు. బుచ్చి కృష్ణయ్య 1857లో చనిపోయారు. తర్వాత జమిందార్ అయిన ఆయన సోదరుడు పట్టాభిరామయ్య 1866లో చనిపోయారు. ఆయన భార్య రామలక్ష్మమ్మ తన పాలనలో పెద్ద సత్రం నిర్మించి అనేక సేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆమె దత్తపుత్రుడు పట్టాభిరామయ్య 1886లో చనిపోగా, మరో ఇద్దరి సంరక్షించింది. 1906లో ఈమె చనిపోగా, బలుసు బుచ్చిసర్వారాయుడు జమిందార్ అయ్యారు. ఈయన 1913లో పెద్ద



బుచ్చి సర్వారాయుడు



సత్యన్నారాయణరావు



పాఠశాల నిర్మించి జిల్లా బోర్డుకు అప్పగించారు. అంగ్లేయుల ఇంపీరియల్ వ్యవసాయ పరిశోధనా సంఘానికి సభ్యుడు. చాగంటి శేషయ్య గారి రాధామాధవము, ఆంధ్ర కవితరంగిణి, సుగ్రీవ విజయము అనే గ్రంథాలను ముద్రింపజేశారు. జిల్లా బోర్డు అధ్యక్షుడిగానూ పనిచేశారు. హసనాబాద్ గ్రామాన్ని సంపాదించారు. 1945లో బ్రిటిష్ ప్రభుత్వం ఈయనకు రావు బహద్దూర్ బిరుదు నిచ్చింది. ఈ బలుసు బుచ్చి సర్వారాయుడు, లక్ష్మీ వెంకట సుబ్బామ్మారావు దంపతుల కుమారులు ఎస్‌బీ ప్రభాకర పట్టాభిరామారావు, ప్రభాకర వెంకట రామ్మోహనరావు, ప్రభాకర వెంకట చలపతిరావు, ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు (చంటి దొర). వీరిలో ప్రభాకర రామ్మోహనరావు మద్రాసులో చదువుకుంటుండగా 17 ఏట మరణించారు. వీరిలో పట్టాభిరామారావు, సత్య నారాయణరావులు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మంత్రు లుగా పని చేశారు. ఇద్దరూ కేంద్ర సహాయ మంత్రులుగా పనిచేయడం విశేషం. చలపతిరావు వ్యాపార రంగంలో రాణించారు. ఎంతో వైభవాన్ని పదిలపర్చు కున్న కపిలేశ్వరపురం దివాణంలో నిర్మించిన భవనానికి 144 ఏళ్లు. ఇది 1880లో నిర్మించారు. అయినప్పటికీ ఇప్పటికీ రాజసానికి చిహ్నాలుగా నిలిచే ఉన్నాయి. భవనాలే కాకుండా పర్నిచర్, వారు వినియోగించిన వస్తువులు అపురూపమైన సంపదగా నిలుస్తున్నాయి. ఆనాటి నిర్మాణాలు అప్పటి వారి నైపుణ్యానికి సాక్షీభూతంగా దర్శనమిస్తున్నాయి. ఈ జమిందారీ సంస్థానం మిగిలిన జమిందారీ వ్యవస్థలకన్నా భిన్నం. ఇది ప్రజలతో మమేకమైన సేవా సౌధం.

రాజమహేంద్రిలో సినీ నటి శ్రీలీల సందడి

ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. 5 ఫ్లోర్లలో సువిశాలంగా దీనిని నిర్మించారు. చీరలు, డ్రెసెస్‌లు, మెన్స్‌వేర్ అన్ని రకాల వస్త్రాలతో అద్భుతమైన రంగులతో ఆఫర్ ధరలతో వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ఈ షాపింగ్ మాల్‌ను సినీ నటి శ్రీలీల ప్రారంభించారు. తొలుత శ్రీలీలకు చెన్నయ్ షోరూం నిర్వాహకులు ఎం.జనార్దన్‌రెడ్డి, జమున, ఎం.వెంకటరెడ్డి, మధులత స్వాగతం పలికారు. అన్ని ఫ్లోర్లలో వస్త్రాలను, జ్యూయలరీ విభాగాన్ని శ్రీలీల పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభించడానికి రాజమహేంద్రవరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాకు నచ్చిన రంగుల వస్త్రాలు చెన్నయ్ షాపింగ్ మాల్‌లో లభ్యమవుతున్నాయన్నారు. ఇటువంటి వాటి కోసం గతంలో చెన్నై వెళ్లాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్స్‌లో లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. తాను నటించిన రాబిన్‌హుడ్ సినిమా ఈ నెల 25న విడుదల కాబోతుందని ప్రేక్షకులు విజయవంతం చేయాలన్నారు. శ్రీలీలను చూడానికి వచ్చిన జనంతో ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డు కళకళలాడింది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసి 600మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర ప్రముఖులు హాజరయ్యారు.




చెన్నయ్ షాపింగ్ మాల్‌ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న శ్రీలీల, బంగారు ఆభరణాలతో సందడి చేస్తున్న శ్రీలీల



రాజమహేంద్రవరంలో వీరేశలింగం పంతులు నివాసంలో జరిపించిన తొలి వితంతు వివాహానికి గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఆంధ్ర కేసరి యువజన సమితి సభ్యులు

తొలి వితంతు వివాహానికి 143 ఏళ్లు

నాడు రాజమహేంద్రవరంలో ఆదర్శ వివాహాలకు వీరేశలింగం నాంది

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వితంతు వివాహాలను ప్రోత్సహించి సంఘసంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వీరేశలింగం పంతులు ధన్యజీవి అని ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. తొలి వితంతు వివాహం జరిపిన రోజును 143 ఏళ్ల తర్వాత బుధవారం కందుకూరి వీరేశలింగం జన్మ గృహంలో నిర్వహించారు. ముక్కుపచ్చలారని బాలికలను, కాసుల మీద ఆశతో పండు ముసలివారికిచ్చి పెళ్లి చేసే సంప్రదాయాన్ని వీరేశలింగం పంతులు బద్దలుకొట్టారన్నారు. వాటి నుంచి సంఘ సంస్కరణ ఉద్యమానికి సమాజంలో బీజాలు పడ్డాయని తెలిపారు. తొలి వితంతు వివాహం జరిగి 143 ఏళ్లయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, కళారత్న పీవీఎస్.కృష్ణారావు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు కె.తిమ్మరాజు,పురావస్తు శాఖ ఉద్యోగి మూసా, ఆంధ్రకేసరి యువజన సభ్యులు దూర్వాసులు సత్యనారాయణ, గుడిపూడి సునీల్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

21న ఉమ్మడి జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, 1 నుంచి 7వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఈ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. సర్వసభ్య సమావేశానికి జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు,స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా సంఘాల ఛైర్మన్‌లు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఒక ప్రకటనలో కోరారు.

ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ సముద్రం మాత్ర ప్రశాంతంగా ఉండటం గమనార్హం. అయితే బుధవారం ఉదయం సముద్రంపైకి వేటకు వెళ్లిన మత్స్యకారులు మధ్యాహ్నానికి ఒడ్డుకు చేరుకున్నారు.

తగ్గేదెలే...!

కలపను వస్తువులుగా తయారుచేసి తరలిస్తున్న ఉన్నతాధికారి
లారీని అడ్డుకున్న గ్రామస్తులు



భారీగా టేకు కలపతో పట్టుబడ్డ లారీ

కూనవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో కంచె చేను మేస్తోంది. కొంత మంది అటవీ శాఖాధికారులే స్మగ్లర్ల అవతారమెత్తి భారీగా టేకు కలపను రవాణా చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ శాఖాధికారిణి (ఎఫ్ఆర్‌వో) మోహిని విజయలక్ష్మి నందిగామలో భారీగా టేకు కలప తరలిస్తూ పట్టు బడ్డారు. వాటి విలువ లక్షల్లో ఉంటుందని అంచనా. మోహిని విజయలక్ష్మి అల్లూరి సీతారామ రాజు జిల్లా కూనవరం ఎఫ్ఆర్‌వోగా పనిచేస్తూ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. అయితే ఆమె ఈ ప్రాంతంలో విలువైన టేకు, జిట్రేగి ఉండడంతో వాటిని ఇక్కడి నుంచి ఆమె స్వగ్రామమైన తిరువూరుకు తరలిస్తున్నారని గతంలో వార్తలొచ్చాయి. తరలించిన టేకు కలపను అక్కడ లక్షల్లో విక్రయించారన్న విమర్శలు వచ్చాయి. గతంలోను ఆమె టేకు కలప తరలిస్తూ సీసీ పుటేజ్‌లో సైతం కనిపించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మోహిని విజయలక్ష్మి 3 రోజులుగా కూనవరంలో తిష్ట వేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గతంలో ఆమె పనిచేసిన సమయంలో పట్టుబడ్డ కలపను వస్తువులుగా తయారుచేసి ఆమె బుధవారం తరలిస్తుండడంతో నందిగామలో గ్రామస్తులు లారీని అడ్డుకున్నారు. దీంతో లారీపై టార్పాలిన్ తెరవగానే లక్షల్లో విలువచేసే కలప ఉండడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

'పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం ఉమ్మడి ప్రణాళిక'

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం సీటీఆర్ఐ, ఐజీసీఎల్ ఉమ్మడి ప్రణాళిక రూపొందించినట్టు సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. బుధవారం సీటీఆర్ఐలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఇండియన్ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నారు. వర్జీనియా పొగాకులో కలపకు బదులుగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) క్యూరింగ్ విధానానికి వాడుకునేందుకు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం, పరిశోధనలు వేగవంతం చేసేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 40వేల పైచిలుకు ఉన్న పొగాకు బ్యారన్‌లలో ఉపయోగించే కలపను గణనీయంగా తగ్గించుకోవచ్చని రైతులకు కలప సంబంధిత సమస్యలు, ఖర్చు తగ్గుతాయన్నారు. సమావేశంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ జీఎం యోగరాజ్ సురేష్, చీఫ్ మేనేజరు పీవీ లలిత, మేనేజరు డిభాస్కర్, అసిస్టెంట్ మేనేజరు విగోపాల్ పాల్గొన్నారు.

మహాసంస్థానంలో

లక్ష తులసి అర్చన



శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు బుధవారం విశేషపూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య రుత్విక్కులు తులసి దళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకి సేవ కనులపండువగా నిర్వ హించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్ల ప్రతిభ

ప్రథమస్థానంలో పురుషుల జట్టు

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పదోవ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు ప్రతిభ కనబరిచాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 4రోజులు పాటు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితానీ సత్యనారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మజ బహుమతులు, మెడల్స్ బహూకరించారు. విజేతలుగా నిలిచిన ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు(అయలు), జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు మొగలి కాశీవిశ్వనాథం అభినందించారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా పురుషుల, మహిళల జట్ల సభ్యులు

మామిడికి బీమా!

- పంటల బీమాలో మామిడికి స్థానం
- రైతులకు ప్రభుత్వం తీపి కబురు
- ఎకరాకు ప్రీమియం కింద రూ.2,000 చెల్లించాలి
- పంటనష్టం జరిగితే ఎకరాకు రూ.40వేల పరిహారం
- ఈనెల 15తో ముగుస్తున్న గడువు



సామర్లకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నో దశాబ్దాలుగా మామిడి రైతులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. ఈ మేరకు మామి డీ రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్(రీస్ట్రక్చర్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు గణనీయంగా ఉప శమనం లభించనుంది. కూటమి సర్కారు తీసు కున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంతోపాటు జిల్లాలోని మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా సాగు

ఉమ్మడి తూర్పు జిల్లాలో గణనీయంగానే మామిడి సాగు ఉంది. కాకినాడ జిల్లాలో 18,252 ఎకరాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో 20,500 ఎకరాల్లోను, కోనసీమలో 12,000 ఎకరాల్లోను మామిడి సాగు జరుగుతోంది. ఈ పంట మీద 10వేలమంది రైతులు ఆధారపడి ఉన్నారు. కాకినాడ జిల్లాలో తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, జగ్గంపేట, పెద్దాపురం మండలాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో రంగంపేట, రాజానగరం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో, కోనసీమలోను పలుచోట్ల మామిడితోటల సాగు జరుగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మామిడితోటల సాగు గణనీయంగా పెరిగింది. కానీ బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పంటకు బీమా వర్తింపచేయాలని ఏళ్ల తరబడి రైతులు పోరాడుతున్నారు. వారి పోరాటం ఫలించి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లో చోటు

అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతోపాటు ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు రాష్ట్రంలో రబీ సీజన్(2024-25)లో పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాన్ని మామిడికి వర్తింపజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా ఉద్యానవనశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలవుతున్న జిల్లాల్లో కాకినాడ జిల్లాకు కూడా చోటు దక్కింది.

ఐదేళ్ల ముందు తోటలకే వర్తింపు

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అమలవుతున్న 15 జిల్లాల్లో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం వేర్వేరుగా నిర్ణయించింది. కాకినాడ జిల్లాలోని మామిడి రైతులు ఎకరాకు రూ.2వేల చొప్పున ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.40వేల నష్టపరిహారం లభించే అవకాశం ఉంది. ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 2020, అక్టోబరు 1 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

దశాబ్దాల ఆకాంక్ష

మామిడి పంటకు బీమా సదుపాయం కల్పించాలని దశాబ్దాలుగా రైతులనుంచి డిమాండ్ ఉంది. వాతావరణంలో ఏర్పడే మార్పుల కారణంగా ఎక్కువ నష్టపోయేది మామిడి రైతులే. బీమా పథకంవల్ల వారి నష్టాలను కొంతవరకైనా పూడ్చుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

బీమా ఎప్పుడు.. ఎలా వర్తిస్తుందంటే..

అకాల లేక అధిక వర్షం:	15.12.2024 నుంచి 28.02.2025
చీడపీడల వాతావరణం: (ముసురు, తేమ)	15.12.2024 నుంచి 28.02.2025
ఉష్ణోగ్రతలో వ్యత్యాసం:	01.01.2025 నుంచి 15.03.2025
అధిక గాలి వేగం:	01.03.2024 నుంచి 31.05.2025

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఒక్కో రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేయించుకోవచ్చు. భూమి పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్, బ్యాంకు ఖాతా జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, పీఏసీఎస్, పీహెచ్‌ఏ, పీఎస్‌ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంక్ లేదా కామన్ సర్వీసు సెంటర్ లేదా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

15 లోపు ప్రీమియం చెల్లించాలి

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కోసం రైతులు ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించినరోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంటనష్టం కూడా 2024, డిసెంబరు 15 నుంచి 2025, మే 31 మధ్యకాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, తేనెమంచు, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలివేగం, చీడ పీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండలస్థాయి అధికారులు నష్టాన్నిలెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు.
-మల్లిఖార్జున్, ఉద్యానశాఖాధికారి, కాకినాడ

తండ్రి మందలిస్తాడనే భయంతో విద్యార్థి ఆత్మహత్య



జిల్లెల్ల బన్నీ

మలికిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలిస్తాడనే భయంతో ఓ విద్యార్థి కంగారులో చింతలమోరిలోని శంకరగుప్తం డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. దీనికి సంబంధించిన వివరాలివి. కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరి జడ్పీ హైస్కూలులో జిల్లెల్ల బన్నీ (15) అనే బాలుడు 9వతరగతి చదువుతున్నాడు. ఈనెల 10న ఇంటినుంచి వెళ్లి అతడు తిరిగి రాలేదు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో తల్లిదండ్రులు మలికిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం సాయంత్రం శంకరగుప్తం డ్రెయిన్‌లో అతడి మృతదేహాన్ని చూసిన స్థానికులు వారికి సమాచారమిచ్చారు. బన్నీ తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధ పడుతుండగా తల్లి కుటుంబాన్ని పోషిస్తోంది. తండ్రి మందలిస్తాడనే భయంతోనే అతడు డ్రెయిన్‌లో దూకేసి ఉంటాడని చెప్తున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆరేపల్లి అనిల్ ఈనెల 10న రాత్రి కాతేరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. పంగిడి హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్దకు చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిన అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.108అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో రంగంపేట మండలంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రంగంపేట ఎస్ఐ తోటకృష్ణసాయి తెలిపిన వివరాల్నప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన కురుకూరి అన్నవరం స్థానికంగా చికెన్‌షాపు నిర్వహిస్తున్నాడు. చికెన్‌షాప్‌లోఉన్న బాక్స్‌కి కరెంట్ ఉన్న విషయం తెలియక బుధవారం అతడు దాన్ని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి కింద పడిపోయాడు. అతడి భార్యకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో బంధువుల సహాయంతో రామహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం అమ్మిన సొమ్ములు ఖర్చు చేయడంపై వివాదం

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

ఎటపాక, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన సొమ్ములు భర్త ఖర్చు చేయడంపై దంపతుల మధ్య వివాదం తలెత్తి క్షణికావేశంలో భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట గ్రామానికి చెందిన గుండి నాగేష్ (56) ఇటీవల పండించిన ధాన్యంలో నాలుగు బస్తాలను అమ్మి ఆ డబ్బులు ఖర్చు చేశాడు. దీంతో బుధవారం భార్య రామమ్మ ఎందుకు ధాన్యం అమ్మిన డబ్బులను ఖర్చు చేశావని నిలదీసింది. క్షణికావేశంలో ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. నాగేష్‌ను వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. భార్య రామమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 70 గ్రాముల బంగారం అపహరణ
- రాయవరం మండలంలో ఘటన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్ఐ బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లాలోని రాయవరం మండలం చెల్లూరులోని బొడ్డువారికూడలిలో బలుసు రమాదేవి అనే మహిళ నివసిస్తోంది. ఆమె భర్త మరణించగా కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది.ఆమె తన తల్లికి అనారోగ్యంగా ఉండడంతో ఈనెల 4న తల్లిని చూసేందుకు ఇంటికితాళం వేసుకుని వెళ్లింది. ఈనెల 9వతేదీ సాయంత్రం 6 గంటలకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం తెరిచి ఉండడం.. ఇంట్లో ధాన్యం అమ్మకాలు జరపగా వచ్చిన కొంత నగదుతో పాటు 30 గ్రాముల బంగారు గొలుసు, 40 గ్రాముల బంగారు గాజులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు బాధితురాలు రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీం పరిశీలించింది.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట

- నాలుగు జిల్లాల్లో 29 బైక్‌లు చోరీ
- నలుగురి అరెస్టు.. వీరిలో ముగ్గురు బాలలే
- మరొక నిందితుడు పరారీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు బానిసలైన యువకులు, బాలలు కలిసి 29 బైక్‌లు, స్కూటీలను చోరీ చేశారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. దొంగిలించిన బైక్‌లు మాత్రం నాలుగు జిల్లాల పరిధికి చెందినవి కావడం గమనార్హం. ఈ మేరకు రాజమహేంద్రవరం త్రీటౌన్‌లో బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కాతేరు గామన్ బ్రిడ్జి రోడ్డులో ఈనెల 11న వాహనాల తనిఖీ చేస్తుండగా 16నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల నలుగురు యువకులు రెండు మోటార్ సైకిళ్లపై వెళ్తూ పోలీసులను చూసి వెనక్కి పారిపోతుండగా వెంటాడి పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా రాజమహేంద్రవరం వీకర్స్ కాలనీకి చెందిన కుప్పం తేజ(19)తోపాటు మరొక ముగ్గురు బాలలను గుర్తించామన్నారు. వీరితోపాటు ఈ బైక్ దొంగతనాలకు పాల్పడిన రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన శ్రీరామ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ ఐదుగురు కలిసి జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌లు స్కూటీలు దొంగిలించారని తెలిపారు. వీరు దొంగిలించిన బైక్‌లను కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్నలకు విక్రయించారని తెలిపారు. కొన్ని బైక్‌లను రాజమహేంద్రవరం క్వారీ గోతుల్లో దాచిపెట్టారని చెప్పారు. ఈ ఐదుగురు దొంగలు కలిసి త్రీటౌన్ పరిధిలో 12 బైక్‌లు, ప్రకాష్‌నగర్, రాజానగరం, కోరుకొండ, ధవళేశ్వరం, కడియం, అడిడీ, నిడదవోలు, ప్రత్తిపాడు, ఏలూరు ప్రాంతాల్లో స్కూటీలను అపహరించారని తెలిపారు. ఈ దొంగ బైక్‌లు కొనుగోలు చేసుకున్న వారిపైన సెక్షన్ 4(11)కింద కేసులు నమోదు చేశామన్నారు. దొంగిలించిన బైక్‌ల విలువ రూ.11.60 లక్షలు ఉంటుందన్నారు. నిందితుల్లో ముగ్గురు బాలలను జువైనల్ కోర్టుకు, మరొకరిని రిమాండ్‌కు పంపించామని, ఇంకొకరు పరారీలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ వి.అప్పారావు, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి హరియాణాకు తరలిస్తుండగా కూనవరంలో స్వాధీనం
- ముగ్గురి అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కన్నపరాజు

కూనవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒడిశానుంచి హరియాణాకు వెయ్యి కిలోల గంజాయితో వెళ్తున్న లారీని పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎటపాక సీఐ కన్నపరాజు తెలిపిన వివరాలివి. పశ్చిమ బెంగాల్ నుంచి ఓ లారీ బియ్యం లోడుతో ఏపీలోని కాకినాడలో సరుకు దిగుమతి చేశారు. ఆ లారీ వైజాగ్ వెళ్లింది. అక్కడ బరస్‌టర్ లోడు చేసుకుని అక్కడినుంచి ఒడిశా వచ్చింది. ఒడిశాలో కలిమిలా దగ్గర ఎంపీ 81 అడవిలో అదే ప్రాంతానికి చెందిన సమాల్‌దేవ్ అనే వ్యక్తిని పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు కలిశారు. అక్కడ గంజాయి కొనుగోలు చేసి బరస్‌టర్ కింద లోడ్ చేసుకుని బయలుదేరారు. అక్కడి నుంచి ఏపీలోని చట్టీ రాగానే పోలీసులు ఏడురాళ్లపల్లి మీదుగా వెళ్లాల్సిన వాహనాలను కూనవరం వైపు మళ్లించారు. అప్పటికే పోలీసులు పక్కా సమాచారంతో కూనవరం మండలంలో జగ్గవరం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బుధవారం ఈ లారీ పట్టుబడింది. దీంతో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌తో పంచనామా నిర్వహించారు. 25కిలోలు ఉండే 40 బ్యాగుల్లో ఈ గంజాయిని స్మగ్లర్లు ఎగుమతి చేస్తున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు షేక్ షలిన్, షేక్ అక్తర్‌తోపాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంపీ 81 గ్రామానికి చెందిన సమాల్‌దేవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. కూనవరం ఎస్ఐ లతశ్రీ, ఏఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పులి జాడ కోసం అటవీ సిబ్బంది వెతుకులాట



బాపన్నదొర అటవీప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ట్రాప్ కెమెరా

ప్రత్తిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో సంచరిస్తున్న పులిజాడకోసం బుధవారం అటవీశాఖ సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు కొనసాగించారు. నాలుగైదురోజులుగా ఈ అటవీప్రాంతంలో తిష్ట వేసిన పెద్దపులి కదలికలపై అటవీ సిబ్బంది సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో కలియ తిరుగుతు న్న ఈ పెద్దపులిని ఇబ్బందికరమైన చర్యలు తీసుకోకూడదనే నిర్ణయానికి అటవీశాఖాధికారు లు వచ్చారు. బురదకోట 3.4 కిలోమీటర్ల పరిసరాల్లోనే పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండురోజుల్లోను మండలంలోని రౌతుపాలెం తోటల్లో పులి సంచరించినట్లు ఆ రైతులు చెబుతున్నారు. రౌతుపాలెం, పాండవులపాలెం, కిత్తమూరుపేట, పొదురుపాక, తాడువాయి, దోపర్తి పరిసరాల్లో కూడా పులి సంచరించినట్లు సమాచారం. దీంతో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పులి కదలికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న గిరిజనులు పశువులను, అటవీప్రాంతంలోకి తరలించవద్దని, ఒంటరిగా అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో ఏలేశ్వరం రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు బుధవారం గాలింపు చర్యలు చేపట్టినా పులి ఆచూకీ తెలియరాలేదు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితుల్లో కొందరికి బుధవారం అందజేశారు. మొత్తం 34 సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పట్టుకున్నారు. వాటి విలువ రూ.7,04,600 ఉంటుందని తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సెల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి రాజమహేంద్రవరం డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు అందజేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

- నన్నయ వీసీ శ్రీనివాసరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సుధాకర్



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

దివాన్‌చెరువు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): యువత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వైశ్రీనివాసరావు సూచించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువఉత్సవ్ కార్యక్రమం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. యువత సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టిసారిస్తే ఆరోగ్యం, ఆనందం కలుగుతాయన్నారు. యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. నెహ్రూ యువజన కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్ పెయింటింగ్, పద్యాలు, రాయడం, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



వివాహిత దేవి మృతదేహం.. దేవి(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడాదికే వివాహిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన కొవ్వూరులో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీకి చెందిన నేతల దేవి (21) స్వస్థలం కాకినాడజిల్లా తొండంగి మండలం చిన్నాయిపాలెం. బుధవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకుముందు భర్త వీరబాబుకు ఫోన్ చేసి చికెన్ తెమ్మని చెప్పింది. అతడు చికెన్ పట్టుకుని వచ్చి వీరబాబుకు భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. కిందకు దింపే సరికి మృతి చెందిందని, ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో గత నెలలో 20రోజులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించామని వీరబాబు తెలిపాడు. వీరికి వివాహం జరిగి ఏడాది కావస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇప్పటివరకు బాధితులనుంచి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

హెరిటేజ్ పాల రైతులకు రూ.125కోట్ల రుణాలు

- సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు



కోటనందూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం ద్వారా దేశంలోని 12రాష్ట్రాల్లో రైతులకు రూ.125కోట్లు రుణాలు అందించామని సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం కాకినాడ జిల్లాలోని కోటనందూరు హెరిటేజ్ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది ఇంతవరకు 10వేల మందికి రుణాలిచ్చామన్నారు. దేశంలో ని 12 రాష్ట్రాల్లో రోజుకు 19 లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నామని, ఈ పాలను 15లక్షల కుటుంబాలకు అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. రాబోయేరోజుల్లో ప్రతిఏటా 3లక్షలలీటర్ల పాల ఉత్పత్తిని పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు. 3లక్షలమంది రైతులకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటుతోపాటు పాలరైతులకు తక్కువ ధరకే పశుదాణా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో 9500 పాలసేకరణ కేంద్రాల ద్వారా 18 ప్రాసెసింగ్ యూనిట్‌లకు పాలసేకరణ చేస్తున్నామని తెలిపారు. ఆ సమావేశంలో హెరిటేజ్ హెడ్ ప్రొక్యూర్‌మెంట్ ఇన్‌పుట్స్ ఎస్.రామ్మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వి.దివాకర్ ఉన్నారు.

అనారోగ్యంతో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఒడిశాకు చెందిన దాశరథి మహాపాత్ర (40) అనారోగ్యంతో మరణించాడు. వన్‌టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన మహాపాత్ర ఈ ఏడాది సెప్టెంబరులో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడ్డాడు.అతనికి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌ఖైదీగా ఉన్నాడు. కొద్దిరోజులుగా మూర్ఛ, శ్వాససంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. మంగళవారం అతడికి వాంతి కావడంతో జైలు ఆస్పత్రిలో చికిత్స అందించారు. రాత్రికి పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి జైలు సిబ్బంది తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ పంటకాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో పోతవరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌తోపాటు భార్య ఉమ, కుమారులు రోహిత్, మనోజ్ ప్రయాణిస్తున్నారు. ఈప్రమాదంలో విజయ్‌కుమార్ బయటపడగా భార్య ఉమ(32), కుమారులు రోహిత్(9) మృతిచెందారు.మరో కుమారుడు మనోజ్(5) గల్లంతు కాగా.. అతడి మృతదేహం సంఘటనాస్థలికి కూతవేటుదూరంలో బుధవారం లభ్యమైంది. విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా సీఐ భీమరాజు దర్యాప్తు చేపట్టారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపో నందు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

'ధనకొండ మృతి జనసేనకు తీరని లోటు'



దాసరి ధనకొండ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాయకుడు దాసరి ధనకొండ మృతి పార్టీకి తీరని లోటు అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. బుధవారం సూర్యారావుపేటలో పార్టీ నాయకులతో కలసి ధనకొండ కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించారు. ధనకొండ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. జనసేన బలోపేతం, ఇద్దరు ఎంపీటీసీ స్థానాలు పార్టీకి రావడం, ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం ధనకొండ విశేష కృషి చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సోడి ముసలయ్య, శాండీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కరప, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నడకుదురులో బుధవారం ఎమ్మెల్యే పంతం నానాజీ పర్యటించి కుమారుడి వియోగంతో బాధపడుతున్న జనసేనపార్టీ సీనియర్ నాయకురాలు ముమ్మిడి పుష్పలతను పరామర్శించారు. తుమ్మలపల్లి గోవిందరాజులు తదితరులున్నారు.

ఘనంగా గీతా జయంతి



వెంకటరాయపురం రామాలయంలో పూజలు చేసిన విద్యార్థులు

కొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొమరగిరి శివారు వెంకటరాయపురంలో శ్రీ సీతారాముని ఆలయంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

సర్పవరం జంక్షన్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ శ్రీసత్య దంత వైద్యశాలలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో గీతా జయంతిని నిర్వహించారు. దైనందిన జీవన ప్రమాణాలు సరైన మార్గంలో పయనించేందుకు భగవద్గీతను చదవాలని కోరారు. భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సాయి కార్తీక్, డాక్టర్ స్వరూప్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య ఉన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కరపలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కరప, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కరప వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, సూర్యనారాయణ, గోపాలకృష్ణ, దీక్షితులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు మండా శ్రీనివాస్ దంపతులు ప్రసాద వితరణ చేశారు.

సహస్ర గులాబి అర్చన

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువ మూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి సహస్ర గులాబి అర్చన జరిగింది. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, ఋత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, ఋత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమాల మంత్రహోమాదులు, మంగళహారతి నిర్వహించారు. పూజల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం-పెనుమర్తి బోర్డర్ పరిధిలో కాదంబరి లేఅవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్ఐ రవీంద్రబాబు దాడి చేసి పట్టుకున్నారు. పెద్దాపురం మండలానికి చెందిన బి.నాగబాబు(నాగేంద్ర), వాలు తిమ్మాపురం గ్రామానికి చెందిన వనపర్తి రాజేష్‌లను అదుపులోకి తీసుకుని 4.3కిలోల గంజాయి నిస్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





క్యూ కట్టాయి...!

కాకినాడ స్మార్ట్‌సిటీగా పేరొందింది. అయితే స్మార్ట్‌సిటీ కార్యాలయం వద్ద రోడ్డుపై గేదెలు వాహనదారులకు అడ్డుగా నిలిచి అటుపై కార్యాలయంలోకి క్యూ కట్టిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

ఫొటోగ్రాఫర్, కాకినాడ

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల్లో కూటమి తరపున ఎవ్వరు పోటీ చేసినా గెలిపించాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టుకు శివారుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో వరదలు వస్తే ముందు ముంపునకు గురవుతుందని, సాగునీటి సమస్య ఉంటే నీరందక పంటలు ఎండిపోతాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో టీడీపీ హయాంలో తాను ఎమ్మెల్యేగా పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని రూ.1750కోట్లతో నిర్మించి రెండు పంటలకు పుష్కలంగా నీరు అందించామని చెప్పారు. అదే విధంగా ముంపు నివారణ, ఏలేరు ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. జగన్ సీఎంగా ఉండగా వీటిని నిర్లక్ష్యం చేయడమే గాక టెండర్లు పిలిచి ప్రారంభించిన ఏలేరు ఆధునీకరణ పనులను రద్దు చేశారని విమర్శించారు. తాను సీటు త్యాగం చేసిన సమయంలో చంద్రబాబును కోరిన మేరకు పురుషోత్తపట్టణం ద్వారా ఈ ఏడాది సాగునీరు అందించడం జరిగిందన్నారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ చేపడతామని చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వీటిని సాధించుకోవడానికి నూరుశాతం కూటమి అభ్యర్థులను గెలిపించాలని రైతులను కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు నామా దొరబాబు, సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీనివాస్, నల్లా శ్రీను, కోడిగుడ్ల పెదకాపు, కోలా రాజు, కూరాకుల రాంబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పిఠాపురం సీఐ శ్రీనివాస్



గొల్లప్రోలు మార్కెట్‌సెంటర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

గొల్లప్రోలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పలు రకాలుగా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలులోని మార్కెట్‌సెంటర్‌లో బుధవారం రాత్రి సైబర్ నేరాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మేసేజీలకు స్పందించవద్దన్నారు. ఎవరైనా ఓటీపీ లేదా ఆధార్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే ఇవ్వవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బ్యాంకుల నుంచి వీటి వివరాలు కోరుతూ ఎవ్వరు ఫోన్ చేయరని తెలిపారు. అదే రీతిలో బహుమతులు వచ్చాయని, ఆన్‌లైన్ షాపింగ్ చేయకున్నా మీకు పార్సిల్ వచ్చిందని ఫోన్ చేస్తూ ఉంటారని, అటువంటి వారికి వివరాలు ఇవ్వవద్దని తెలిపారు. అనుమానాస్పద కాల్స్, మెసేజీలు వస్తూ ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాబోధన అందించిన ఆదినారాయణ



ఆదినారాయణ సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ప్రమాణాలకు ధీటుగా అన్ని వర్గాల ప్రజలకు ఉత్తమ విద్యాబోధన అందించిన ఘనత ఆదినారాయణకు దక్కుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లో నిర్వహించిన నెహ్రూ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ మతుకుమిల్లి ఆదినారాయణ సంతాప సభలో వారు ప్రసంగించారు. రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎయిడెడ్ పాఠశాలల బలోపేతానికి, మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేశారన్నారు. వేలాదిమంది విద్యార్థులకు విద్యా ప్రదాత, వందలాది మంది ఉపాధ్యాయులకు జీవనాభ్యుదయ ప్రదాత ఆదినారాయణ అని అన్నారు. నేటి తరానికి, విద్యా రంగానికి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని, ఆయన మృతి ప్రైవేట్ విద్యాసంస్థలకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు రాయుడు నాగేశ్వరరావు, అమన్ జైన్, జేడీ పవన్‌కుమార్, సుంకర విద్యాసాగర్, యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆదర్శ కళాశాలల చైర్మన్ పి కనకరాజు, పలు విద్యాసంస్థల చైర్మన్‌లు సామా ఈశ్వరరావు, సుజ్ఞాన్, నారాయణ, సురేష్, ప్రకాష్, బేగ్, ఇదయతుల్లా, ఆదినారాయణ కుమారులు మతుకుమిల్లి శ్రీ సత్యనారాయణ, మతుకుమిల్లి శ్రీ విజయ్, మతుకుమిల్లి శ్రీ కృష్ణ, ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 12 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12న ఉండూరు, వల్లూరు, మామిళ్లదొడ్డి గ్రామాలకు ఉండూరు పంచాయతీ కార్యాలయం వద్ద సదస్సు జరుగుతుందన్నారు. 13న పనసపాడు, కొప్పవరం గ్రామాలకు అచ్చంపేట పంచాయతీ కార్యాలయం వద్ద, 16న మాధవపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద, 17న పండ్రవాడ, 18న పవర, 19న నవర, 20న కాపవరం, 21న వీ.వేమవరం, 23న వీకె.రాయపురం, బోయినపూడి గ్రామాలకు వీకె.రాయపురం పంచాయతీ వద్ద, 24న జి.మేడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద, 26న పెద బ్రహ్మదేవం పంచాయతీ కార్యాలయం వద్ద, 27న వేట్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద, 28న జగ్గమ్మగారిపేటకు హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయం వద్ద, 30న సామర్లకోట, భీమవరం గ్రామాలకు సామర్లకోట ఎంపీడీవో కార్యాలయం వద్ద సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

తాళ్లరేవు: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామసభలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ భారతి అన్నారు. చొల్లంగి, చొల్లంగిపేట గ్రామాల్లో రెవెన్యూ, భూసమస్యలపై సభలను తహశీల్దార్ పి.త్రినాదరావు అధ్యక్షతన నిర్వహించారు. చొల్లంగిలో 30మంది, చొల్లంగిపేటలో 10మంది ఫిర్యాదులు చేశారు.

కొత్తపల్లి: గోర్సలో సర్పంచ్ రొంగల వీరబాబు అధ్యక్షతన బుధవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. తహశీలార్ జి.చిన్నారావు, డిప్యూటీ తహశీల్దార్ డీవీ.మురళీకృష్ణ, ఏఎస్‌వో బండి అప్పలరాజు పాల్గొన్నారు.

కరపలో రేపటి నుంచి..

కరప: మండలంలో ఈనెల 13 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. 13న నడకుదురు, 16న గురజనాపల్లి, 17న పెనుగుదురు, 18న గొర్రిపూడి, 19న పెద్దాపురప్పాడు, 20న వేములవాడ, 21న కొంగోడు, పాతర్లగడ్డ, 23న యండమూరు, 24న వేళంగి, 26న వేములవాడ, 27న సిరిపురం, జి.బావారం, 29న చినమామిడాడ, వాకాడ, జనవరి 2న కరప, 3న కొరుపల్లి, జడ్.బావారం,4న అరట్లకట్టలో ఉంటాయన్నారు.

జోరందుకున్న అభివృద్ధి పనులు

కాకినాడ రూరల్‌లో వేగంగా సిమ్మెంట్, కనెక్టవిటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు



వాకలపూడి నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లేందుకు కనెక్టవిటీ రోడ్డు నిర్మాణం దృశ్యం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పలు సిమ్మెంట్ రోడ్లు, లింక్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఆగస్టులో ప్రారంభించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులను ఉపాధిహామీ పథకం నిధులను వెచ్చిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు పరిష్కరిస్తామన్న హామీ ఇవ్వడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి మంజూరైన సిమ్మెంట్ రోడ్లు, కనెక్టవిటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు సగం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

రూ.6.87 కోట్లతో అభివృద్ధి పనులు

కాకినాడ రూరల్ మండలంలో పల్లె పండుగలో భాగంగా 16 గ్రామ పంచాయతీల పరిధిలో 84 రకాల పనులను గ్రామసభల ద్వారా గుర్తించారు. ఇందుకు అవసరమైన రూ.6.87 కోట్లను ఉపాధిహామీ పథకం నుంచి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో నేమాం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, పెనుమర్తి, పి.వెంకటాపురం, పండూరు, సూర్యారావుపేట, సర్పవరం, తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాల్లో సిమ్మెంట్ రోడ్లు, సిమ్మెంట్ డ్రైనేజీలు, కనెక్టవిటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పలు సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీలు, కనెక్టవిటీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అభివృద్ధి పనులు పారదర్శకంగా జరగాలని, ప్రజలు భాగస్వామ్యంతో నాణ్యమైన రోడ్లు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఉపాధి హామీ నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులన్నీ డిసెంబరు నెలాఖరు నాటికి కాకినాడ రూరల్, కరప మండలాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో విడతలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.40కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

డీఏవో విజయకుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న విజయకుమార్

సామర్లకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి, అత్యున్నత జీవనోపాధి, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ చెప్పారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జిల్లాస్థాయిలో బుధవారం ఒకరోజు సమీక్ష నిర్వహించారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజరు ఇలియాజర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్షలో ముఖ్య అతిథిగా డీఏవో విజయకుమార్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడకం వల్ల దిగుబడి తక్కువగా వస్తుందనే అపోహ రైతుల్లో ఉందని కానీ సేంద్రియ ఎరువులు వాడకం వల్లే అధిక దిగుబడులు వస్తాయనేది క్షేత్రస్థాయి విజయాలే నిదర్శనమన్నారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలైన ఆర్పీఎస్ కిట్స్ తయారీ విధానం, పలు పంటల సాగు విధానం, కషాయాల తయారీ, ఏ గ్రేడ్, ఏటీఎంమోడల్, ఎస్పీఎం షాప్స్ ఏర్పాటు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానంపై డీఏవో సమీక్షించారు. ఇలియాజర్ ప్రకృతి వ్యవసాయంలో మేలు అంశాలను సమగ్రంగా వివరించారు. సమీక్షలో డిప్యూటీ డైరక్టర్ బీవీఎస్‌సీ హరి, ఏడీఏ మాధవి, సామర్లకోట ఏవో ఐసత్య, సీనియర్ థిమాటిక్ లీడ్ జానకి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె

మూడో రోజు మున్సిపల్ వర్కర్ల ఆందోళనలు

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ టెక్నికల్, నాన్ టెక్నికల్ వర్కర్లు నిర్వహిస్తున్న సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. పురపాలక సంఘ కార్యాలయంలో విధులు బహిష్కరించి వారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు రాంబాబు, చెట్టుబత్తిన సురేష్, పెంకే రాంబాబు, మురాలశెట్టి అచ్చిరాజు, కరణం శ్రీను, కోవెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు బుధవారం సమ్మె కొనసాగించారు. మున్సిపల్ కార్యాయలం ఎదుట ధర్నా శిబిరం నిర్వహించి విధులను బహిష్కరించి నిరసన దీక్షల్లో పాల్గొన్నారు. సామర్లకోట యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి వివి.రామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పులపకూర రామకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి నక్కా రత్నరాజు ఆధ్వర్యంలో సుమారు 22 మంది వర్కర్స్ సమ్మెలో పాల్గొన్నారు. వర్కర్స్ సమ్మె కారణంగా ఇంజనీరింగ్ శాఖలోని వివిధ పనులకు తీవ్ర ప్రతిష్ఠంబన ఏర్పడింది. ధర్నాలో చుండ్రు వెంకటరాజేష్, కాకాడ నాగార్జున, లంక శ్రీహరి, గరగ స్వామి, మామిడాల కొండబాబు, భాగ్యలక్ష్మి, భూదేవి వెంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని సీనియర్ కో-ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, వైసీపీ కౌన్సిలర్ నేతల హరిబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు.

'మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి'

పెద్దాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుంప సాగు చేసే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.జగన్నాథం అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో సాగులో ఉన్న దుంప పంటలను ఆయన హార్టికల్చర్ రీసెర్చ్ (హెచ్ఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ జానకి, ఐసీఏఆర్ శాస్త్రవేత్త పి.ప్రకాష్‌తో కలిసి బుధవారం పరిశీలించిన అయన మాట్లాడారు. కర్రపెండలం సాగులో విత్తన ఎంపికే కీలకమని, సాగు తొలిదశలో మేలైన విత్తన రకాలను ఎంచుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు కార్యక్రమంలో హెచ్ఆర్ఎస్ టీఏ పావనీ ప్రియాంక, వీహెచ్ఏ చిలకమ్మ, వీఏఏ సత్య, రైతులు కల్తూరి వెంకట్రాజు, మోరంపూడి ఆదినారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి విజయానికి చేసిన కృషికి తగిన గుర్తింపు'

కాకినాడ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా సానా సతీష్‌కు, రాష్ట్ర మంత్రిగా కొణిదెల నాగబాబుకు అవకాశం కల్పించడం కూటమి పార్టీల విజయానికి చేసిన కృషికి తగిన గుర్తింపు అని కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి విశేష కృషి చేసిన సతీష్‌కు రాజ్యసభ పదవి, జనసేన పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాగబాబుకు మంత్రి పదవి ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యావంతుడైన సతీష్ రాజ్యసభ సభ్యుడిగా ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కేంద్ర నిధులు తేగలరన్నారు. రాష్ట్ర పరిస్థితులపై అవగాహన కలిగిన నాగబాబు మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేయగలరన్నారు.

81 సీసాల మద్యం పట్టివేత

కాకినాడ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పూటీ సెంటర్ వద్ద కాకినాడ సౌత్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై మొహమద్ ఆలీ సిబ్బందితో కలిసి రూట్ వాచ్ నిర్వహిస్తుండగా హీరో మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న 81 సీసాల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్టు సీఐ టీనిరంజన్‌రావు బుధవారం తెలిపారు. యానాంలోని సావిత్రీనగర్‌కు ఓలేటి శివ గంగాద్రి యానాం నుంచి కాకినాడకు హీరో హెచ్ఎఫ్ డీలక్స్ పీవై04ఏ 9010 నెంబరు గల మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామని ఆయన తెలిపారు.

ముగిసిన దత్తభక్తుల పాదయాత్ర

వన్నెపూడిలో బిక్ష స్వీకరణ



వన్నెపూడి దత్తాత్రేయస్వామి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన దత్తభక్తులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి పిఠాపురంలోని దత్త క్షేత్రానికి దత్తభక్తులు చేపట్టిన పాదయాత్ర బుధవారం ముగిసింది. హైదరాబాద్‌లోని శ్రీపాదశ్రీవల్లభ దత్త పీఠం మాతాజీ లత దత్త ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈనెల 2న పాదయాత్ర ప్రారంభించి పిఠాపురం చేరుకున్నారు. అక్కడ నుంచి వన్నెపూడి చేరుకుని గ్రామంలో పాదయాత్రగా తిరుగుతూ బిక్ష స్వీకరించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వన్నెపూడి, పిఠాపురం ప్రాంతాలకు చెందిన దత్తభక్తులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



తాటిపర్తిలో గ్రామోత్సవం దృశ్యం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేషపూజలు జరిగాయి. మయూర వాహనంపై స్వామి,అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



కాకినాడ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీల ఆదాయాన్ని బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. షష్ఠి మహోత్సవంలో భాగంగా 21 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.2,39,994 వచ్చినట్లు ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. లెక్కింపులో కాకినాడ మంత్రిప్రగడ సత్రం గ్రేడ్ 1 ఈవో కె.సుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకులు, భక్తులు, టీడీపీ, జనసేన నాయకులు కొజు నెహ్రూ, అప్పారావు పాల్గొన్నారు.

'మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి'

జగ్గంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై చేసిన దాడులను ఖండిస్తూ జగ్గంపేట నియోజకవర్గంలో ఏపీయూడబ్ల్యూజే సభ్యులు నిరసన తెలిపారు. కాపు కల్యాణ మండపంవద్ద బుధవారం వివిధ పత్రిక జర్నలిస్టులందరూ మోహన్‌బాబును తక్షణమే పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రెండో రోజు రిలే దీక్షలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, ఆదివాసీలు

ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు మడకం దూలయ్య

చింతూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు మడకం దూలయ్య డిమాండ్ చేశారు. ఆదివాసీ యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆదివాసీలు ఐటీడీఏ ముందు చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. బుధవారం శిబిరాన్ని ప్రారంభించిన దూలయ్య మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీ యువతకే కేటాయించాలని కోరారు. గిరిజనేతరుల బోధనతో ఆదివాసీ చిన్నారులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం చింతూరు, రంపచోడవరం డివిజన్లకు దూరంగా ఉందన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు పోలవరం అసెంబ్లీ పరిధిలోని ఏజెన్సీ మండలాలను కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేస్తే దూరాభారం తగ్గుతుందన్నారు. పూనెం చిన్నవీరభద్రం, పులి వీరయ్య, సోడె రాఘవయ్య, సోడె ప్రసాద్, రవ్వ ప్రసాద్, పైడా ముత్తయ్య, సున్నం కన్నయ్య, సవలం కోటి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో భద్రత కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు సోడే ముత్తయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీల అభివృద్ధి కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం వెనుకబడిన ఆదివాసీ తెగలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్-హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కుంజా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఎస్పీ ఆధ్వర్యంలో నెల్లిపాకలో చేపట్టిన 48 గంటల రిలే నిరాహార దీక్ష బుధవారం ముగిసింది. ఏఎస్పీ నాయకులు సవలం వెంకటేష్, ఉమ్మల దుర్గారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం సమయంలో షెడ్యూల్ తెగలకు వంద శాతం రిజర్వేషన్ కల్పించాలని జీవో నెం.3ను జారీ చేయగా ఉమ్మడి రాష్ట్రంలో అనేక జిల్లాల్లో 50వేల మంది ఉద్యోగాలు పొందారన్నారు. సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో నెం.3పై రాష్ట్ర ప్రభుత్వం టీఏసీ తీర్మానాన్ని ఆమోదించి, రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో ఆదివాసీ యువత ఉద్యోగ భద్రత కోసం అసెంబ్లీలో షెడ్యూల్ ప్రాంతం ఉద్యోగ నియామక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న ముంపు మండలాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దారు కారం సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీడియం సురేష్, ఊకే కిరణ్ కుమార్, పొలమంచి తమ్మయ్య, ఇర్పా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





ఎటపాక మండలం నెల్లిపాక, కూనవరంలో దీక్షా శిబిరాల్లో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు.

అభివృద్ధి పనులకు ఆ అధికారే అడ్డు: ఎంపీపీ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

వీఆర్ పురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో అభివృద్ధి పనులు ముందుకు సాగట్లేదని ఎంపీపీ కారం లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. విశాఖపట్టణంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీగా వున్న ఎస్.శ్రీనివాస్ పనులకు సాంకేతిక అనుమతి ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. 5శాతం ఇవ్వాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నారన్నారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాప్రతినిధులను సమీకరించి విశాఖపట్టణంలోని ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు. సర్పంచ్‌లు పులి సంతోష్‌కుమార్, పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, కారం బుచ్చమ్మ, ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి'



రికార్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశించారు. బుధవారం ఆమె ఐర్లపల్లి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మంచి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వంటశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న తహసీల్దారు వేణుగోపాల్

వై.రామవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవిటిదిబ్బలు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు వేణుగోపాల్, వ్యవసాయాధికారులు బుధవారం ప్రారంభించారు. గ్రేడ్-ఎ రకం క్వింటాలుకు రూ.2,320, 75 కిలోలకు రూ.1,740, సాధారణ రకానికి క్వింటాలు రూ.2300, 75 కిలోలు రూ.1725 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ రాంబాబు, వ్యవసాయాధికారిణి ఉషారాణి, వీఏవో సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

'అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి'

చింతూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఐటీడీఏ సబ్ కమిటీ కన్వీనర్ ఉర్సా వెంకటనారాయణ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్టీలను అన్యాయంగా దూర ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రదర్శనలో యూటీఎఫ్ నాయకులు ఎం.కవిత, పి.కృష్ణయ్య, బి.ముత్తయ్య, ఎం.సోమరాజు, ఎ.నాగేశ్వరరావు పి.కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

దేవీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంటూరు కాలనీలో దేవీపట్నం ఎస్‌ఐ షరీఫ్ సైబర్ నేరాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, బెల్టు షాపులు నిర్వహించరాదన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు అధికమయ్యాయని, అవగాహనతోనే వాటిని నివారించవచ్చన్నారు.

మహిళలు పాలరంగాల్లో రాణించేందుకు చర్యలు

హెరిటేజ్ సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు



మహిళా రైతులకు రుణాలందిస్తున్న సాంబశివరావు

కోటనందూరు,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మహిళాసాధికారతే లక్ష్యంగా మహిళలు పాల రంగాల్లో రాణించేందుకు హెరిటేజ్ పాల ఉత్పత్తి ద్వారా కృషి చేస్తున్నామని సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం కోటనందూరు హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రంలో పాలరైతులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. దీనిద్వారా రైతులు ఆర్థికంగా ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల పాల యూనిట్ పెంచేందుకు తక్కువ వడ్డీకే అడిగిన రెండురోజుల్లో రుణాలందిస్తున్నామని తెలిపారు. విశాఖ రీజియన్ పరిధిలో గల విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంతోపాటు కాకినాడ జిల్లాలో కొంతభాగంలో రోజుకు 1.75లక్షల పాలసేకరణ చేస్తున్నామని తెలిపారు. మరింత పెంచేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముందుగా కోటనందూరు డైరీలో పశువుల మెడికల్ క్యాంప్‌తోపాటు, వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా 20యూనిట్ల రక్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మహిళా రైతులకు రుణాలిచ్చారు. ఉత్తమ రైతులకు అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ హెడ్ ప్రొక్యూర్‌మెంట్ ఇన్‌పుట్స్ ఎస్.రామ్మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వి.దివాకర్, సయ్యద్‌మీరా, మేనేజర్ ఆర్పై నాయుడు, న్యూఇండియా ఇన్సూరెన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసన్, హెరిటేజ్ రైతు సంక్షేమ అధికారి డాక్టర్ బోనత్ శ్రీను, రీజినల్ హెడ్ పితులసినాయుడు, లంకభారతి, దేవి, రైతులు యర్ర చినసత్యనారాయణ, రుత్తల కాసులు పాల్గొన్నారు.

'జ్యోతుల' ఫౌండేషన్ పెళ్లికానుక

జగ్గంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక గ్రామానికి చెందిన నవ దంపతులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లికానుక రూ.20వేలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి, తనయుడు అనీష్‌నెహ్రూ బుధవారం అందజేశారు.

రెండోరోజు కంటి వైద్యశిబిరం

జగ్గంపేట,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెక్యుంటి సీ ఫుడ్స్ ఆర్థిక సహాయంతో విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ద్వారా కాట్రావులపల్లిలో మంగళవారం రెండో రోజు మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు.

'మా భూమి మాకే కావాలి'

తొండంగి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ భూములకు సాగుపట్టాలివ్వాలని పి.అగ్రహారం రైతులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తహశీల్దార్ మురార్జీ అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. దీనికి హాజరైన రైతులు గతంలో అన్‌టైటిల్డ్‌గా ఉన్న భూములను వైసీపీ ప్రభుత్వ సమయంలో ఉత్తరాది మఠం పేరున మార్పు చేశారని, దాన్ని రద్దు పరచి తమ పేర్లు నమోదు చేయాలని కోరారు.

'ఔట్‌సోర్సింగ్'కు మద్దతు

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుని మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులకు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సంఘీభావం తెలిపారు. వారికి వైసీపీ మద్దతుగా ఉందని ఆయన తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తునిలో పెద్దఎత్తున ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో చేపడుతున్న నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ పి.జగదాంబ స్పష్టం చేశారు. తుని మండలం డి.పోలవరంలో నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్డు, పశువుల షెడ్లను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

ఏలేశ్వరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతాజయంతి పురస్కరించుకొని గీతాశ్రమంలో ముక్కోటి నేతృత్వంలో బుధవారం లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరీటి ఆధ్వర్యంలో మహిళలు భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేశారు.

హాస్టల్ విద్యార్థులకు కౌన్సెలింగ్

కోటనందూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు బుధవారం రాత్రి ఎస్‌ఐ టి.రామకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగహన కల్పించడంతోపాటు మాదక ద్రవ్యాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రౌతులపూడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దబ్బపాలెం గ్రామశివారులో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట జరుగుతోందన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి రూ.7200 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సానా సతీష్‌కు యనమల శుభాకాంక్షలు



తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను సత్కరిస్తున్న సానా సతీష్

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన టీడీపీ నేత సానా సతీష్‌బాబు రాజ్యసభకు ఎంపిక కావడంతో ఆయన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను కలిసి తాను రాజ్యసభ ఎంపికకు సహకరించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి యనమలకు శాలువా కప్పి సత్కరించారు. రాజ్యసభకు వెళ్తున్న సానా సతీష్‌బాబుకు యనమల రామకృష్ణుడు శుభాకాంక్షలు తెలిపారు.

'యాజమాన్యం తక్షణమే స్పందించాలి'



పరిశ్రమను తెరిపించి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి కోరుతూ నిరసనలు కొనసాగాయి. ఉపాధి కోల్పోయి 26 రోజులుగా పరిశ్రమ గేటు వద్ద నిరసన కొనసాగిస్తున్న కార్మికులకు బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను మద్దతు తెలిపారు. యాజమాన్యం వైఖరి మానుకుని కార్మికుల కుటుంబాలకు తగిన న్యాయం చేకూర్చాలన్నారు. కొప్పన కోటేశ్వరరావు, మెయ్యాటి ప్రకాశరావు ఉన్నారు.

నిబద్ధతతో జర్నలిజంలో పనిచేయాలి: ఎమ్మెల్యే నెహ్రూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నియోజకవర్గ సమావేశం కాపు కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షుడు అడపా వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారన్నారు. నిబద్ధతతో జర్నలిజంలో పని చేయాల్సి ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. జగ్గంపేట ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి, ఇళ్లస్థలాలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ ధాట్ల కృష్ణవర్మ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారోతి శివ గణేష్, వైసీపీ యువ నాయకులు తోట రాంజీ, ఆర్యవైశ్య సేవా సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండేల శ్రీరామమూర్తి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల కమిటీలను, నియోజకవర్గ కమిటీని సన్మానించారు. అతిథులను నియోజకవర్గ కమిటీ సత్కరించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోశాధికారి వెలిది వెంకటరత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు అడపా శ్రీనివాస్, నియోజకవర్గ కార్యదర్శి చింతల రాంబాబు, పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడులో చినజీయర్ స్వామి పర్యటన

నరేంద్రగిరి క్షేత్రం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమ ఏర్పాట్లు పూర్తి



ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండపై పూలదండల తయారీలో మహిళలు

ప్రత్తిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండపై నిర్మిస్తున్న ఆంధ్రా భద్రాద్రి రామాలయం వద్ద గురువారం శ్రీరామపాదుకా పట్టాభిషేక కార్యక్రమ నిర్వహణకు త్రిదండి చినజీయర్ స్వామి తరలిరానున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని బుధవారం సాయంత్రానికి నరేంద్రగిరి క్షేత్రం వద్ద శ్రీరామ సేవక్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నరేంద్రగిరి కొండపై పెద్దఎత్తున షామియానాలు ఏర్పాటు చేసి చినజీయర్‌స్వామి ప్రసన్నం చేసుకునేందుకు అనువుగా వేదికను సిద్ధం చేశారు. వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీనివాస్, నరళ దంపతుల నివాస గృహంనుంచి చినజీయర్‌స్వామి, త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వాములు, గురువారం నరేంద్రగిరి క్షేత్రానికి భక్తులు తరలిరావడానికి ఏర్పాట్లు చేశారు.

అమ్మో... పాము!



దేవీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లోని రహదారులపై పాములు తిరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఫజుల్లాబాద్ గ్రామ శివారున రహదారిపై బుధవారం సాయంత్రం ఒక పాము చాలా సేపు వరకు కదలకుండా ఉండిపోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్లేవారు భయాందోళనకు గురై అక్కడే ఉండిపోయారు. కొద్దిసేపటికి పాము వెళ్లిపోయింది.

పీజేఎస్ పాల్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

రంపచోడవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీజేఎస్ పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పీజే స్టీఫెన్ పాల్ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి రూ.15లక్షల సామగ్రిని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఎస్టీ బాలుర హాస్టల్లో రూ.7లక్షల సామగ్రిని అందజేశారు. బోర్నగూడెంలో సెమీ క్రిస్మస్ ఏర్పాటుచేసి 500 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, సోజు, ప్రకాష్, కిషోర్, జాన్, డాక్టర్ రోహిణి, డాక్టర్ ముఖర్జీ పాల్గొన్నారు.



ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

అడ్డతీగల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండల ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు బుధవారం నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులను పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు విస్సి కుమార్ శాలువాతో సత్కరించారు.

జేకేటీసీ ట్రస్టు ఆర్థిక సహాయం

వీఆర్ పురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరేవుపల్లి గ్రామంలో మృతి చెందిన సవలం శారద కుటుంబానికి జమాల్‌ఖాన్ ట్రస్టు సభ్యులు బుధవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు సభ్యులు ఎస్‌డీ సర్వరాజు, ముత్యాల రామారావు, బాగుల వెంకటరమణ, ముత్యాల శంకర్‌రావు, స్థానికుడు కోట్ల బాలయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీల పూడిక తీత

అన్నవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా కొంతకాలంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొలగింపు ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభించినట్టు పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన జిల్లా కార్మిక సంఘం నాయకుడు టీడీపీ నేత పత్రి రమణను బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పరామర్శించారు. ఆయన మాతృమూర్తి సూర్యకాంతం మృతి చెందడంతో ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు.

శైలజరావుకు డాక్టరేట్

గండేపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న కె.శైలజరావుకు కృష్ణ యూనివర్సిటీ మచిలీపట్నం డాక్టరేట్‌ను ప్రదానం చేశారని కళాశాల డైరెక్టర్ ఎన్.సుగుణరెడ్డి తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

గండేపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్(మెన్) టోర్నమెంట్ నరసారావుపేట ఇంజనీరింగ్ కాలేజీలో జరిగాయి. ఈ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు పాల్గొని తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు.

'బాల్యవివాహాలను అరికట్టాలి'

శంఖవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టేలా విస్తృత ప్రచారం నిర్వహించాలనిఎంపీడీవో శర్మ అన్నారు. ఆర్యవైశ్య కళ్యాణమండపంలో సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం కిషోర వికాసం శిక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు, జిల్లా ప్రొటెక్షన్ అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరోపణలు అవాస్తం'

రౌతులపూడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమల్లవరంలోని అంబేద్కర్ గురుకులం పాఠశాల, కళాశాలలో అసాంఘిక కార్యక్రమాల ఆరోపణలు అవాస్తమని కళాశాల ప్రిన్సిపాల్ జీ.విజయ్, వైస్ చైర్మన్ ఎం.రాజి అన్నారు. ఈ ఆరోపణలు నిజం కాదన్నారు.

చిట్టిబాబుకు డాక్టరేట్

తొండంగి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వనపర్తి చిట్టిబాబుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జీవిత బీమా సంస్థలో వ్యవస్థా సామర్థ్యంపై మానవ వనరుల నిర్వహణ ప్రభావం అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ వరించింది.

రేపటి నుంచి ఉద్యమ బాట

తొండంగి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13 నుంచి అన్నదాతకు అండగా వైసీపీ ఉద్యమ బాట పట్టనున్నట్టు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. బుధవారం ఆయన వేమవరంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పోరాడతామన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు సహాయం అందించాలన్నారు.